ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి 5 మెదక్
జిల్లాల వార్తలు
సోమవారం 2 సెప్టెంబరు 2024



ఏడుపాయలలో ఉప్పొంగిన మంజీరా


పాపన్నపేట: ఘణపురం ఆనకట్ట పొంగిపొర్లడంతో ఏడుపాయల వద్ద మంజీరా ఉధృతంగా ప్రవహిస్తున్నది. ఆలయాన్ని వరదనీరు చుట్టుముట్టడంతో ప్రధాన ఆలయాన్ని మూసివేశారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రాజగోపురంలో ఉంచి పూజలు చేస్తున్నారు. ఆదివారం సెలవు కావడంతో వర్షాలను సైతం లెక్కపెట్టకుండా వనదుర్గామాతను దర్శించుకోవడానికి తరలివచ్చారు. ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్పీ సందర్శించి పరిస్థితిని పర్యవేక్షించారు.



అలుగుపారుతున్న సంగారెడ్డి మహబూబ్‌సాగర్ చెరువు



తూప్రాన్ వద్ద కిష్టాపూర్ రోడ్డులో హల్దీవాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో నిలిచిపోయిన రాకపోకలు



ఏడుపాయల వద్ద ఆలయాన్ని చుట్టుముట్టిన మంజీరా నీరు

కుండపోత..

వాయుగుండం వణుకు పుట్టిస్తోంది. అల్పపీడన ప్రభావంతో మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిశాయి. 24 గంటలు కురిసిన వర్షం జనజీవనాన్ని అతలాకుతలం చేసింది. ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. వాగులు, వంకలు, కాలువలు పొంగి పొర్లుతున్నాయి. ప్రాజెక్టులు పారుతున్నాయి. రహదారులన్నీ జలమయమయ్యాయి. భారీ వర్షానికి ప్రధాన రహదారులపై నీరు చేరి వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలుచోట్ల డ్రైనేజీలు పొంగిపోవడంతో రోడ్లపై వరద నీరు ప్రవహించింది.

ఏకధాటి వర్షానికి వణికిన మెదక్ జిల్లా

- అత్యధికంగా పాతూర్‌లో 21 సెంటీమీటర్లు
- ఉధృతంగా పారుతున్న వాగులు, వంకలు
- కొట్టుకుపోయిన రోడ్లు, నిలిచిన రాకపోకలు
- ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు.. జలమయమైన కాలనీలు
- నేడు ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలకు సెలవు

మెదక్/మెదక్‌అర్బన్/ నర్సాపూర్/ శివ్వంపేట/ కౌడిపల్లి/ టేక్మాల్/ చిన్నశంకరంపేట/హవేళిఘణపూర్/అల్లాదుర్గం/పెద్దశంకరంపేట/ తూప్రాన్/మనోహరాబాద్/వెల్దుర్తి/చేగుంట/మాసాయిపేట

ఏకధాటిగా కురిసిన వానతో మెదక్ జిల్లావాసులు తడిసిముద్దయ్యారు. గడిచిన 24 గంటల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదయ్యాయి. శనివారం ఉదయం నుంచి ఆదివారం సాయంత్రం వరకు మెదక్ జిల్లా రికార్డుస్థాయిలో వర్షపాతం నమోదైంది. ఈ సీజన్‌లోనే అత్యధికంగా గడిచిన 24 గంటల్లో మెదక్ మండలం పాతూర్‌లో 21 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. రాజ్‌పల్లి 17.4సెం.మీ., మెదక్ 14.2సెం.మీ., నాగాపూర్ 13.5సెం.మీ., మిన్పూర్ 13.4 సెం.మీ., దామారంచ 13.1సెం.మీ., సర్ధన 13.0సెం.మీ., కొల్చారం 12.0సెం.మీ., కౌడిపల్లి 11.7సెం.మీ., కాగాజ్‌మాద్దూర్ 11.0 సెం.మీ., టేక్మాల్, నర్సాపూర్ 10.5సెం.మీ., పెద్దశంకరంపేట 10.4సెం.మీ., రేగోడ్ 10 సెం.మీ., హవేళీఘణపూర్ 9.3 సెం.మీ., నిజాంపేట 8.14 సెం.మీ., కొల్చారం 8.0 సెం.మీ., రేగోడ్ 7.5 సెం.మీ., మెదక్ 7.2 సెం.మీ., పాపన్నపేట 7.1 సెం.మీ., చేగుంట 6.7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. రానున్న 24 గంటల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ సూచించింది.

రాకపోకలకు అంతరాయం

మెదక్ పట్టణంలోని చమన్- పోస్టాఫీస్ రోడ్డు జలమయం కావడంతో రాకపోకలు నిలిపివేశారు. నర్సాపూర్- హైదరాబాద్ రహదారిమధ్యలో పెద్ద వృక్షం నేల కూలి రాకపోకలకు అంతరాయం ఏర్పడడంతో పోలీసులు తొలగించి దారి సరిచేశారు. హవేళీ ఘనపూర్ మండలం వాడి పంచాయతీ పరిధిలోని ధూప్‌సింగ్ తండాకు వెళ్లే రహదారిలో గల బ్రిడ్జిపై నుండి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. హల్దీవాగు ఉధృతి పెరగడంతో తూప్రాన్ మండల కేంద్రం నుంచి కిష్టాపూర్, వెంకటాయపల్లి, నర్సంపల్లి గ్రామాలకు రకపోకలు నిలిచిపోయాయి. నిజాంపేట మండలం చల్మెడ వాగు పొంగిపొర్లుతుండడంతో ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. నందిగామ సాయి చెరువు అలుగు పారడంతో రామాయంపేట-కాట్రియాల రహదారిపై వరద నీరు చేరి రాకపోకలు బంద్ అయ్యాయి. చిలప్‌చేడ్ మండల పరిధిలోని బందంబాయి వాగు పొంగి ఆప్రాంతమంతా జలమయమైంది. హకీంపేట హల్దీ ప్రాజక్ట్ పొంగిపొర్లుతోంది. కొల్చారం మండలం కొంగోడు వద్ద హల్దీ వాగు పొంగి పోర్లుతుండటంతో మెదక్-కొంగోడు మధ్య రాకపోకలు నిలిచి పోయాయి. చేగుంటలోని ఎన్జీవో కాలనీలో ఇళ్ల మధ్యలో వర్షపునీరు నిలిచింది. పోచారం ప్రాజక్టులోకి భారీ స్థాయిలో నీరు ప్రవహిస్తుండడంతో జలకళ సంతరించుకుంది. రాయిన్‌పల్లి పాతూర్ మధ్యలో రహదారిపై వరదనీరు వచ్చి చేరడంతో జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ ప్రవాహాన్ని పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. మెదక్ మండలం రాయిన్‌పల్లి చెరువు అలుగు పారుతోంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు జిల్లాలో 362 చెరువులు పూర్తిస్థాయిలో.. 1,860 చెరువులు సగం నిండాయి. 105 చెక్‌డ్యాములు అలుగు పారుతున్నాయి.



నిజాంపేట మండలం వెంకటాపూర్‌లో కూలిన ఇల్లు

మెదక్ జిల్లాలో కూలిన 54 ఇళ్లు

జిల్లాలో ఎడతెరపిలేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దాంతో పలు గ్రామాల్లో పురాతన ఇళ్లు కూలిపోతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 54 ఇళ్లు పాక్షికంగా కూలిపోయినట్లు కలెక్టరేట్ వర్గాలు తెలిపాయి. ఎక్కడా కూడా ప్రాణం నష్టం జరగలేదని. బాధితులకు పునరావాసం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యా సంస్థలకు సెలవు : మెదక్ కలెక్టర్

మెదక్‌లోని వర్ష ప్రభావిత ప్రాంతాల్లో మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, కమిషనర్ జానకీరాంసాగర్‌తో కలిసి పర్యటించారు. రాయిన్‌పల్లి-పాతూర్ రహదారిపై వరద నీరు ప్రవహాన్ని, మెదక్-రామాయంపేట మధ్య నూతనంగా నిర్మించిన బ్రిడ్జి క్రింద నీటి ప్రవహాన్ని పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని చమన్ వద్ద రోడ్డుపై నిలిచిన నీటిని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా నేడు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలకు సెలవు ప్రకటించినట్లు జిల్లా, మండల, గ్రామ స్థాయి అధికారులు, సిబ్బంది అలర్ట్‌గా ఉండాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. మత్స్యకారులు చేపల వేటలకు వెళ్లొద్దని సూచించారు. రెవెన్యూ పంచాయతీ, పోలీస్ అధికారులు పరిస్థితులను పర్యక్షించాలన్నారు. అత్యవసర సమయాల్లో సహాయం చేయడానికి కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూం 9391942254 నంబర్‌ను ఏర్పాటు చేశామన్నారు.

ఎడతెరిపిలేని వర్షం.. పొంగిపొర్లుతున్న వాగులు, చెరువులు

సంగారెడ్డి టౌన్/అర్బన్/జిన్నారం/రామచంద్రాపురం/కోహీర్/నారాయణఖేడ్/మనూరు: సంగారెడ్డి జిల్లావ్యాప్తంగా శనివారం రాత్రి నుంచి ఆదివారం రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగిపొర్లుతుండగా, చెరువులు అలుగు దుంకుతున్నాయి. పత్తిపంట నీట మునిగి, పలు గ్రామాల్లో రోడ్లు దెబ్బతిన్నాయి. జిల్లాలో అత్యధికంగా వట్‌పల్లి మండలంలో 81.8 మి.మీ వర్షపాతం నమోదు కాగా.. అత్యల్పంగా కల్హేర్ మండలంలో 4.3 మి.మీ వర్షపాతం నమోదయింది. అందోలులో 79 మి.మీ., సిర్గాపూర్‌లో 71 మి.మీ., కంగ్టిలో 64.5 మి.మీ., మనూరులో 61 మి.మీ., నిజాంపేటలో 60.5 మి.మీ., నాగల్‌గిద్దలో 59.8 మి.మీ., సిర్గాపూర్ 55.3 మి.మీ., నారాయణఖేడ్‌లో 50.8 మి.మీ., జహీరాబాద్‌లో 48.5 మి.మీ., ఝరాసంగంలో 35 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

- జోగిపేట: అందోలు మండలంలోని కిచ్చన్నపల్లి వద్ద పిట్లం నుంచి సంగారెడ్డి వస్తున్న సంగారెడ్డి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వర్షానికి అదుపుతప్పి రోడ్డు పక్కనే పొలంలోకి జారిపోయింది. ఎవరికీ గాయాలు కాలేదు. అందోలు నుంచి సాయిబాన్‌పేట వెళ్లే దారిలో గూడెం వద్ద భారీ వృక్షం కూలిపోయి రోడ్డుపై పడిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి.
- సంగారెడ్డిలోని మహబూబ్‌సాగర్ చెరువు గరిష్ఠ నీటి మట్టానికి చేరుకుని అలుగు పారుతున్నది. మండలంలోని ఈర్గిపల్లి గ్రామానికి వెళ్లే రహదారిపై అదుపు కారు పంటపొలాల్లోకి దూసుకెళ్లింది.
- పుల్‌కల్ మండలం సుల్తాన్‌పూర్ పెద్దచెరువు, చౌటకూర్‌లోని నాయిని చెరువు, శివంపేటలోని పెద్ద చెరువుతో పాటు కుంటల్లోకి నీరు చేరింది.
- నారాయణఖేడ్ పట్టణం, నియోజకవర్గంలోని పంచగామ, నిజాంపేట గ్రామాల్లో కొన్ని ఇళ్లు పాక్షింగా కూలిపోయాయి.
- సిర్గాపూర్ వాసర ఊర చెరువు నిండుకుండలా అలుగు పారుతున్నది.
- మునిపల్లి మండలం అంతరాం-చిన్న చల్మెడ గ్రామాల మధ్య ఉన్న వాగు పొంగడంతో ఇరు గ్రామాల మధ్య రాకపోలు నిలిచిపోయాయి.
- రాయికోడ్-ధర్మారం గ్రామాల మధ్య బస్వన్నవాగు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. రాయికోడ్‌లోని ఓ కాలనీలో వర్షపు నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడ్డారు.
- కొండాపూర్ శివారులోని పెద్ద చెరువు నిండి రోడ్డుపై ప్రవహించడంతో తేర్పోలు, గొల్లపల్లి, మునిదేవునిపల్లి, గుంతపల్లి గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.
- ఝరాసంగం మండలం జీర్లపల్లి చెరువు అలుగు పారుతున్నది.
- ఝరాసంగం, కోహీర్, మునిపల్లి, నాగల్‌గిద్ద తదితర మండలాల్లో వందలాది ఎకరాల్లో పత్తి నీట మునిగింది.
- మునిపల్లి మండలం మేళసంఘంలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కంది శివారులోని 65వ జాతీయ రహదారి పక్కన హైటెన్షన్ విద్యుత్ స్తంభం నేలకొరిగింది.
- సదాశివపేట మండలం నందివాగు పొంగిపొర్లుతున్నది. మెల్గిరిపేట ప్రాజెక్టు నిండి గంగకత్వవాగు నిండుగా పారుతున్నది.



హవేళీఘనపూర్ మండలంలో అలుగుపారుతున్న పోచారం డ్యాం




అల్లాదుర్గం మండలం చిల్వేర్‌లో చెరువును తలపిస్తున్న పాఠశాల



చేగుంట మండలం వి.కొండాపూర్‌లో అలుగుపారుతున్న చెరువు



మెదక్‌లోని ఓ కాలనీలో పరిస్థితిని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్



నిండుకుండలా జహీరాబాద్ నారింజవాగు ప్రాజెక్టు

ప్రాజెక్టులకు జలకళ

- ఇన్‌ఫ్లో 15,622 క్యూసెక్కులు, నిల్వ 17.298 టీఎంసీలు
- తెరుచుకున్న నారింజ ప్రాజెక్టు గేట్లు
- నల్లవాగు ప్రాజెక్టుకు భారీ వరద

పుల్‌కల్/నారాయణఖేడ్/కల్హేర్/జహీరాబాద్, సెప్టెంబరు 1: భారీ వర్షాలకు సింగూరు ప్రాజెక్టు జలకళను సంతరించుకున్నది. వర్షాకాలం ప్రారంభమైన తరువాత తొలిసారి భారీ వరద వస్తున్నది. సంగారెడ్డి జిల్లా పరిధిలోని ప్రాజెక్టు పరీవాహక ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు వాగులు పొంగిపొర్లి వరద వస్తున్నది. ఆదివారం సాయంత్రం 6 గంటల వరకు 15,622 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో నమోదైంది. 24 గంటల వ్యవధిలోనే ఒక టీఎంసీ నీరు చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 523.600 మీటర్లకు 29.917 టీఎంసీలు. కాగా, 520.725 మీటర్లకు 17.298 టీఎంసీలకు చేరకకుంది. మొత్తం 391 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో నమోదైంది.

జహీరాబాద్ పరిధిలోని నారింజ ప్రాజెక్టు నిండుకుండను తలపిస్తున్నది. ప్రాజెక్టు నిల్వ సామర్థ్యం 115 ఎంసీఎఫ్‌టీలు కాగా.. 2,500 ఇన్‌ఫ్లో నమోదవుతున్నది. ప్రాజెక్టు దాదాపు నిండడంతో ఒక గేటును 5 ఫీట్లు ఎత్తి 4వేల క్యూసెక్కులను కర్ణాటకకు వదులుతున్నారు. అలాగే, మల్‌చెల్మ ఈరన్న వాగు ప్రాజెక్టు కూడా పొంగిపొర్లుతున్నది.

కల్హేర్, సిర్గాపూర్ మండలాల్లో కురిసిన వర్షాలకు నల్లవాగు ప్రాజెక్టుకు వరద వస్తున్నది. ఎగువ ప్రాంతంలోని వాసర్, చాప్టా గ్రామాల చెరువులు అలుగుపై ప్రవహించడంతో ప్రాజెక్టులోకి 1,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో చేరుతున్నది. ప్రాజెక్టు నీటి మట్టం 1,493 అడుగుల కాగా.. ప్రస్తుతం 1,489 అడుగులకు చేరుకున్నది. ఒక్కరోజులోనే నీటి మట్టం నాలుగు అడుగులు పెరిగింది. కల్హేర్ మండలంలోని కాకివాగు, మాసాన్‌పల్లి వాగులు పొంగిప్రవహిస్తున్నాయి. నారాయణఖేడ్‌మండలం గంగాపూర్ ప్రాజెక్టు నిండి అలుగు పారేందుకు సిద్ధంగా ఉంది.



జలకళను సంతరించుకున్న సింగూరు ప్రాజెక్టు



పొంగిపొర్లుతున్న నారాయణఖేడ్ వంగ్దల్ వాగు



కోహీర్‌లో పత్తి చేలను ముంచెత్తుతున్న నారింజవాగు



అందోల్ మండలం కిచ్చన్నపల్లి వద్ద రోడ్డు పక్కకి దూసుకుపోయిన బస్సు

తెల్లాపూర్ బిల్డర్లలో హైడ్రా దడ

రామచంద్రాపురం, సెప్టెంబరు 1 : తెల్లాపూర్ చెరువుల పైభాగంలో భూములు కొనుగోలు చేసిన బిల్డర్లలో హైడ్రా దడ మొదలైంది. ఐదేళ్ల క్రితం తెల్లాపూర్‌లోని చెరువులు, కుంటలు, కాలువలు కబ్జాలకు గురవుతున్నా... అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానికులు చెన్నై గ్రీన్ ట్రిబ్యునల్ కోర్టు(ఎన్‌జీటీ)ను ఆశ్రయించారు. కేసు వాదోపవాదాలు విన్న కోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి చర్యలు తీసుకోవాలంటూ ఆదేశాలు జారీ చేసింది. అయిన చెరువుల్లోని అక్రమ నిర్మాణాలను తొలగించలేదు. కొందరు బిల్డర్లు ప్రభుత్వ పెద్దలపై ఒత్తిడి తీసుకవస్తూ తమ భూములపై అధికారులు చర్యలు తీసుకోకుండా జాగ్రత్త పడుతూ వస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం చెరువు భూముల రక్షణ తీసుకొచ్చిన హైడ్రా సంస్థ వారి పనిపడుతూ హడలెత్తిస్తుంది. రెండు రోజుల క్రితం చెలికుంట చెరువు ఎఫ్‌టీఎల్‌లో నిర్మించిన చిన్న ప్రహరీని అధికారులు కూల్చివేశారు. కానీ అసలు క్లబ్‌హౌజ్‌ను కూల్చివేయలేదు. త్వరలో మరిన్ని యంత్రాలు తీసుకువచ్చి కూల్చివేస్తామని అధికారులు పేర్కొన్నారు. ఇప్పటివరకు చెరువులకు సంబంధించి హైడ్రా నివేదికలు అడుగలేదని స్థానిక అధికారులు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. తామే తమ దృష్టికి వచ్చిన ఆక్రమణలు కూలుస్తున్నామని అధికారులు పేర్కొన్నారు. బీఎస్పీ నాయకుడొకరు హైడ్రా కమిషనర్‌ను కలిసి మేళ్ల చెరువుపై ఫిర్యాదు చేశారు. ఈ వారంలో కమిషనర్ తెల్లాపూర్‌కు వస్తారని స్థానికులు పేర్కొంటున్నారు. శనివారం పటాన్‌చెరు, అమీన్‌పూర్ మండలాలకు వచ్చిన కమిషనర్ అక్కడి చెరువులను సందర్శించిన విషయం తెలిసిందే. దీంతో బిల్డర్లలో మరింత ఆందోళన నెలకొంది. అసలు చెరుల పరిరక్షణకు ఎలాంటి చర్యలుంటాయన్న విషయంలో స్థానికంగా ఉత్కంఠ నెలకొన్నది.

ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలి

- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 1 : జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రాణ, ఆస్తి నష్టాలు జరగకుండా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. జిల్లా అధికారులతో నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. అధికారులు వారి పనిచేస్తున్న స్థలాల్లోనే ఉండాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలరి ఆదేశించారు. వీడియోకాన్ఫరెన్స్‌లో ఎస్పీ రూపేష్, అదనపు కలెక్టర్‌లు చంద్రశేఖర్, మాధురి, నీటిపారుదల శాఖ ఎస్‌ఈ యేసయ్య, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ నుంచి మంత్రుల వీడియోకాన్ఫరెన్స్

జిల్లాల్లో మరో రెండు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని, ఎక్కడా ప్రాణ నష్టం జరగకుండా ముందస్తుగానే జాగ్రత్తలు చేపట్టాలని అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. హైదరాబాద్ నుంచి డీజీపీ డాక్టర్ జితేందర్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి ఆదివారం కలెక్టర్‌లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో వీడియోకాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. సహాయక చర్యలు చేపట్టేలా రెస్క్యూ బృందాలను సిద్ధంగా ఉంచాలని, అధికారులందరూ క్షేత్రస్థాయిలోనే ఉంటూ ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షించాలని వారు ఆదేశించారు.

ఏడుపాయల, ఘనపురం కట్ట వైపు వెళ్లొద్దు : ఎస్పీ

పాపన్నపేట, సెప్టెంబరు 1 : వరద ప్రవాహం ఎక్కువగా ఉన్నందున ఏడుపాయల, ఘనపురం కట్ట వైపు భక్తులు, ప్రజలు వెళ్లొద్దని మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సూచించారు. ఆదివారం ఆయన వనదుర్గా ప్రాజెక్ట్, ఆలయం వద్ద వరద ప్రవహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షించాలని పోలీసులకు సూచించారు. ఆయన వెంట ఈవో చంద్రశేఖర్, డీఎస్పీ ప్రసన్నకుమార్, సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్, నీటిపారుదల ఏఈ విజయ్‌కుమార్ ఉన్నారు.



ఏడుపాయల వద్ద వరద ప్రవాహాన్ని పరిశీలిస్తున్న మెదక్ ఎస్పీ

కంట్రోల్‌రూమ్ నంబర్‌ను సంప్రదించాలి

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 1 : జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో అత్యవసర సమయంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లలో లేదా పోలీస్ కంట్రోల్‌రూమ్ నంబర్ 8712656739 ను సంప్రదించాలని సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ తెలిపారు. ఆదివారం ఆయన పోలీసు అధికారులతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో పలు సూచనలు చేశారు.



బస్సును ఢీకొన్న కారు.. ముగ్గురికి గాయాలు

ప్రమాదానికి గురైన కారు

కొండపాక, సెప్టెంబరు 1: ఆర్టీసీ బస్సును కారు ఢీకొట్టడంతో ముగ్గురికి గాయాలైన సంఘటన కొండపాక శివారు రాజీవ్‌రహదారిపై ఆదివారం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నంగునూరు మండలం పాలమాకులకు చెందిన పలువురు కొండపోచమ్మ ఆలయానికి కారులో వెళ్తున్నారు. ఈ క్రమంలో కొండపాక శివారులో ముందు వెళ్తున్న ఆర్టీసీ బస్సును కారు ఢీ కొట్టింది. దీంతో అందులో ఉన్న నాగరాజు, నర్సింహులు, లక్ష్మణ్‌కు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న టోల్‌గేట్ అంబులెన్స్ సిబ్బంది వారికి ప్రథమ చికిత్స చేసి సిద్దిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

తండ్రి మందలించాడని కుమారుడి ఆత్మహత్యాయత్నం

● పరిస్థితి విషమం

శివ్వంపేట, సెప్టెంబర్ 1 : ఖాళీగా ఉండకుండా పనికి వెళ్లాలంటూ తండ్రి మందలించడంతో కొడుకు గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడడంతో పరిస్థితి విషమించిన సంఘటన పిల్లుట్ల గ్రామంలో ఆదివారం చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మండల పరిధిలోని పిలుట్ల గ్రామానికి చెందిన చింత శ్రీధర్(21) ఇంట్లో ఖాళీగా ఉంటుండడంతో ఖాళీగా ఉంటే వ్యసనాలకు అలవాటు పడతారని, పని చేసుకోమని తండ్రి చింత స్వామి కొడుకును మందలించాడు. దీంతో శ్రీధర్ శనివారం రాత్రి గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ ఆస్పత్రికి తరలించినట్లు గ్రామస్థులు తెలిపారు.

కాలుష్య పరిశ్రమను తొలగించాలని పీసీబీ కార్యాలయానికి పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న సాయిని సన్మానిస్తున్న వ్యకాస నాయకులు

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 1 : కాలుష్యం వెదజల్లుతూ రైతులు, ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న ఎవరెస్ట్ పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని అంబేడ్కర్, పూలే మహాజన సంఘం రాష్ట్ర యువజన కో కన్వీనర్ సాయి డిమాండ్ చేశారు. ఈ మేరకు పరిశ్రమ నుంచి హైదరాబాద్ సనత్‌నగర్‌లోని పీసీబీ కార్యాలయం వరకు పాదయాత్ర చేస్తున్న సాయిని సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సాయి మాట్లాడుతూ కాలుష్య పరిశ్రమతో జన జీవనం కష్టతరమైందని అందుకే పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని పాదయాత్ర చేపట్టానన్నారు. అనంతరం వ్యకాస, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శులు నర్సింలు, రమేష్‌గౌడ్ మాట్లాడుతూ కాలుష్య వ్యర్థ జలాలను కాలువల ద్వారా బయటికి వదిలి పంటలను నాశనం చేస్తూ ప్రజలకు ప్రాణహాని కలిగిస్తున్నారని ఆరోపించారు. అధికారులు చూసి వెలుతున్నారే తప్ప ఎలాంటి పరిశ్రమ యాజమాన్యంపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. వెంటనే ఎవరెస్ట్ పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకుని రైతులు, స్థానిక ప్రజలకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ కడుపుతో.. వణుకుతున్న దేహంతో..

● జోరు వానలో యాచకురాలి దీనస్థితి



తడిచిన వస్త్రాలతో, చలికి వణుకుతూ దీనంగా కూర్చున్న యాచకురాలు

మెదక్ కల్చరల్, సెప్టెంబరు 1: నిన్నటి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు యాచకుల పరిస్థితిగా దీనంగా మారింది. అనునిత్యం రద్దీగా ఉండే జిల్లా కేంద్రంలోని దుకాణాలన్నీ మూసివేయడం, రోడ్లపై జనసంచారం లేకపోవడంతో యాచకుల ఆకలి తీర్చే వారు కరువయ్యారు. జిల్లా ప్రభుత్వాస్పత్రికి వెళ్లేదారి పక్కన మూసేసి ఉన్న దుకాణాల ముందు బిక్కుబిక్కుమంటున్నారు. జిల్లా కేంద్రంలోని ఓ దుకాణం వద్ద ఉన్న యాచకురాలు ఉదయం నుంచి సాయంత్రం వరకు చలికి వణుకుతూ, ఎవరైనా దాతలు వచ్చి తమ కడుపు నింపుతారేమోనని దీనంగా కూర్చున్నది. ఆమె దీనస్థితి చూసి పలకరిస్తే మాట్లాడే పరిస్థితి లేదని, తడిచిన బట్టలతో వణుకుతూ ఉన్నది.

మెదక్ చర్చిని సందర్శించిన మధ్యప్రదేశ్ హైకోర్టు రిటైర్డ్ జస్టిస్



రిటైర్డ్ జస్టిస్ విమల జైన్‌ను సన్మానిస్తున్న చర్చి కమిటీ అధ్యక్షుడు సంపత్, ప్రెసిబేటరీ ఇన్‌చార్జి శాంతయ్య

మెదక్ కల్చరల్, సెప్టెంబరు 1: ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ సీఎస్ఐ చర్చిని ఆదివారం ఉదయం మధ్యప్రదేశ్ హైకోర్టు రిటైర్డ్ జస్టిస్ విమల జైన్ సందర్శించారు. వీరిని చర్చి కమిటీ సభ్యులు సన్మానించారు. ప్రెసిబేటరీ ఇన్‌చార్జి శాంతయ్య ఆధ్వర్యంలో శిలువ ఆరాధాన నిర్వహించి, ప్రతిష్ఠించిన అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చర్చి కమిటీ అధ్యక్షుడు సంపత్, తదితరులు పాల్గొన్నారు.

మారుమూల ప్రాంతం నుంచి రాష్ట్రస్థాయి పదవికి..

● పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గుండు లక్ష్మణ్



గుండు లక్ష్మణ్

కల్హేర్, సెప్టెంబరు 1: కల్హేర్ మండలం బీబీపేట గ్రామానికి చెందిన గుండు లక్ష్మణ్ పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఆదివారం నియామకయ్యారు. 1989లో ఉపాధ్యాయ వృత్తిలోకి అడుగిడిన లక్ష్మణ్ ఉపాధ్యాయుల సమస్యలు తీర్చుతూ వారికి చేదోడు వాదోడుగా ఉంటూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని పీఆర్టీయూ సంఘంలో సాధారణ సభ్యుడిగా చేరి అంచలంచెలుగా ఎదిగారు. ప్రస్తుతం సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. రాష్ట్రంలో ఎంతో పోటీ ఉన్నప్పటికీ ఉపాధ్యాయులకు చేసిన సేవలను గుర్తించిన రాష్ట్ర కమిటీ బాధ్యులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలను అప్పగించారు. నిన్నటివరకు ప్రధాన కార్యదర్శిగా కొనసాగిన కమలాకర్ పదవీ విరమణ చేయడంతో హడ్‌హక్ పద్ధతిన లక్ష్మణ్ నియామకం కాగా.. హైదరాబాద్‌లోని పీఆర్టీయూ భవన్‌లో ఆదివారం ప్రమాణం చేశారు. తన ఎన్నికకు కృషిచేసిన టీచర్స్ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, పీఆర్టయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శి కమలాకర్, మాజీ ఎమ్మెల్సీలు మోహన్‌రెడ్డి, పూల రవిందర్‌కు లక్ష్మణ్ కృతజ్ఞతలు తెలియజేశారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యాచకుడి మృతి



యాచకుడి మృతదేహం

గజ్వేల్, సెప్టెంబరు 1: గుర్తు తెలియని వాహనం ఢీకొని యాచకుడు మృతిచెందాడు. గజ్వేల్ సీఐ బి.సైదా వివరాల ప్రకారం.. గజ్వేల్ మండల పరిధిలోని రిమ్మనగూడ వద్ద శనివారం రాత్రి 10 గంటలకు గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి పడి ఉన్నాడన్న సమాచారంతో బ్లూకోల్ట్ సిబ్బంది అక్కడికి చేరుకుని పరిశీలించారు. సదరు వ్యక్తిని 108 అంబులెన్స్‌లో గజ్వేల్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తున్న క్రమంలో రాత్రి 11.40 గంటలకు మృతిచెందినట్లు వైద్యులు తెలిపారన్నారు. మృతుడు యాచకుడిగా పోలీసులు భావిస్తున్నారు. మృతుడికి 68 ఏళ్ల వయస్సు ఉంటుందని, ఎవరైనా గుర్తు పడితే వెంటనే గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు.

ఆవును రక్షించబోయి.. కెనాల్‌లో పడి రైతు మృతి



కనకారెడ్డి మృతదేహం

కోహెడ, సెప్టెంబరు 1: ఆవును రక్షించబోయి.. కెనాల్‌లో ప్రమాదవశాత్తు పడి రైతు ఆదివారం మృతిచెందాడు. తోటపల్లి నుంచి గౌరవెల్లికి వెళ్లే ప్రధాన కాలువ రామచంద్రపూర్ గ్రామం మీదుగా వెళ్తుంది. ఈ ప్రధాన కాలువకు బొబ్బుల కనకారెడ్డి(65) అనే రైతుకు చెందిన వ్యవసాయ బావి ఉన్నది. బావి వద్ద ఉన్న పశువుల కొట్టంలో కట్టేసి ఉంచిన ఆవు తెంపుకుని కెనాల్‌లో పడింది. దానిని కాపాడేందుకు రైతు కాలువలోకి దిగాడు. కెనాల్‌లోని నీటితోపాటు, వరదనీరు ఎక్కువ ఉండడంతో అడుగుభాగాన బురదలో ఇరుక్కుపోయి రైతు మృతిచెందాడు. కనకారెడ్డి కాలువలోకి దిగినప్పుడు కొందరు రైతులు చూసి గ్రామస్థులకు చెప్పారు. వారు వచ్చి బురదలో ఇరుక్కుపోయిన కనకారెడ్డి మృతదేహాన్ని బయటకు తీశారు. విషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని హుస్నాబాద్ ఆస్పత్రికి పంపినట్లు తెలిపారు.

కుటుంబ తగాదాలతో గృహిణి ఆత్మహత్య

రామచంద్రాపురం, సెప్టెంబరు 1: కుటుంబ తగాదాలతో గృహిణి ఆత్మహత్య చేసుకున్న ఘటన కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రవీందర్ కథనం ప్రకారం.. ఉస్మాన్‌నగర్‌లోని సైబర్ కాలనీలో సంగీతప్రియ(30), రాజ్‌కుమార్ దంపతులు నివాసముంటున్నారు. కుటుంబంలో నెలకొన్న చిన్నచిన్న విషయాలకు భార్యాభర్తలు గొడవపడేవారు. ఈ క్రమంలో శనివారం రాత్రి కూడా గొడవపడ్డారు. అనంతరం సంగీతప్రియ గదిలోకి వెళ్లి గడియ వేసుకుంది. భర్త తలుపులు తట్టినా తీయలేదు. తలుపులు బద్దలు కొట్టి చూడగా.. భార్య శవమై కనిపించింది. స్థానికులు ఈ విషయాన్ని పోలీసులకు తెలియజేశారు. ఆ దంపతులకు రెండేళ్ల పాప ఉండటంతో స్థానికులు కన్నీరుమున్నీరయ్యారు. భర్త రాజ్‌కుమార్ స్థానికంగా ఉన్న కేంద్ర ప్రభుత్వ కార్యాలయంలో ఉన్నతాధికారిగా పనిచేస్తున్నాడు. ఈ మేరకు ఎస్ఐ రమేశ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కుక్క కాటుతో వ్యక్తికి తీవ్ర గాయాలు



సుదర్శన్ కాలుకు అయిన గాయం

కంగ్టి, సెప్టెంబరు 1: కుక్కకాటుతో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మండల కేంద్రమైన కంగ్టి గ్రామానికి చెందిన కంతి సుదర్శన్(55) ఆదివారం ఉదయం బైక్‌పై వెళ్తుండగా పెట్రోల్ వద్ద వెనుక నుంచి వచ్చిన కుక్క సుదర్శన్ కాలును గట్టిగా కరిచింది. తీవ్రగాయాలైన సుదర్శన్‌ను స్థానికులు కంగ్టి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స చేయించారు. కాగా కంగ్టిలో కుక్కల బెడద అధికమైందని, అరికట్టాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.



మెదక్‌లో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఐక్య కార్యాచరణ సమితి ఉద్యోగులు



సంగారెడ్డి అర్బన్: సంగారెడ్డిలో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న టీజీఈజేఏసీ నాయకులు, ఉద్యోగ, ఉపాధ్యాయులు



సిద్దిపేట కల్చరల్: సిద్దిపేటలో నిరసన తెలుపుతున్న జేఏసీ ఉద్యోగ సంఘం నాయకులు

నూతన పెన్షన్ రద్దుకు మరో ఉద్యమం

● టీఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్

● సీపీఎస్‌ను రద్దు చేయాలని నల్లబ్యాడ్జీలు ధరించి ఉద్యోగ సంఘాల నిరసన

మెదక్ అర్బన్, సెప్టెంబరు 1: నూతన పెన్షన్ విధానం రద్దుకు మరో ఉద్యమానికి సిద్ధంగా ఉన్నట్లు టీఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ పేర్కొన్నారు. పెన్షన్ విద్రోహ దినంగా పరిగణిస్తూ.. సీపీఎస్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో స్థానిక టీఎన్జీవో భవన్‌లో ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో నల్లబ్యాడ్జీలు ధరించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ నూతన పెన్షన్ విధానం అమలైన 20 ఏళ్లల్లో సీపీఎస్ ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయారన్నారు. అంతేకాకుండా పదవీ విరమణ అనంతరం ఉద్యోగులకు భద్రతనిచే పెన్షన్ లేకపోవడంతో చాలామంది విశ్రాంత సీపీఎస్ ఉద్యోగులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక ముందు ఏ ఒక్క ఉద్యోగి నష్టపోకుండా పాత పెన్షన్ విధానం అమలులోకి తీసుకురావాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ నిరసనలో టీపీటీఎఫ్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, టీఎన్జీవో, ట్రెసా, పీఆర్టీయూ, తపస్, టీపీటీఎఫ్, ఎస్టీయూ, యూటీఎఫ్, టీటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజ్‌కుమార్, మహేందర్‌గౌడ్, సుంకరి కృష్ణ, ఎల్లం, సంగయ్య, రాజ్‌గోపాల్‌గౌడ్, పద్మరావు, శివయ్య, సత్యనారాయణ, వివిధ సంఘాల రాష్ట్ర, జిల్లా నాయకులు మల్లారెడ్డి, చంద్రశేఖర్, హీరాలాల్, సత్యనారాయణరెడ్డి, ఫణిరాజ్, ఫజులొద్దీన్, నగేష్, శివరాం, గోపాల్, రామాగౌడ్, ఉద్యోగ, ఉపాధ్యాయ, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

●నర్సాపూర్: పెన్షన్ విద్రోహ దినోత్సవం సందర్భంగా ఆదివారం నర్సాపూర్ మండల విద్యాధికారి కార్యాలయం వద్ద వర్షంలోనే ఉపాధ్యాయ జేఏసీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ 2004 నుంచి అమలవుతున్న నూతన పెన్షన్ వల్ల ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థిక భద్రత లేకుండా పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు డాకియా, నాగుర్‌మీరా, రమేష్‌రాజు, శివకమార్, అప్పలనాయుడు, భాస్కర్, శ్రీహరి, పెంటయ్య, నరేందర్, శ్రీహరి, కృష్ణ, శ్రీనివసరావు, రాములు పాల్గొన్నారు.

ఉద్యోగుల పాలిట శాపంగా 'సీపీఎస్'

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 1: ఉద్యోగుల పాలిట శాపంగా మారిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని టీజీఈజేఏసీ చైర్మన్ జావిద్‌అలీ, కో చైర్మన్ వైద్యనాథ్ డిమాండ్ చేశారు. పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని ఐబీ నుంచి కొత్త బస్టాండ్ వరకు వర్షాన్ని లెక్కచేయకుండా నల్లబ్యాడ్జీలు ధరించి ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లు భారీ నిరసన ప్రదర్శన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తన మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా సీపీఎస్ విధానం రద్దు హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను విడుదల చేయాలని, పీఆర్‌సీ వేతన సవరణ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ, ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సంఘాల నాయకులు వై.అశోక్‌కుమార్, సాబేర్‌అలీ, వి.రవి, సుధామణి పాల్గొన్నారు.



నర్సాపూర్ ఎంఈవో కార్యాలయం వద్ద వర్షంలోనే నిరసన తెలుపుతున్న జేఏసీ ఉపాధ్యాయులు

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబరు 1: కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలని తెలంగాణ ఉద్యోగ జేఏసీ నాయకుడు గ్యాదరి పరమేశ్వర్ డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించేంత వరకు అన్ని ఉద్యోగ, పెన్షనర్ల సంఘాలను కలుపుకొని ఐక్యపోరాటం చేస్తామన్నారు. ఇందులో భాగంగా సెప్టెంబరు 1న పెన్షనర్ల విద్రోహ దినమని తెలంగాణ ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ముస్తాబాద్ చౌరస్తా వద్ద మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు శ్రీనివాస్, శశిధరశర్మ, రాజేశం, యాదగిరి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

● మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 1: కాంగ్రెస్ ప్రభుత్వ బడ్జెట్‌లో కేటాయించిన రూ.5 వేల కోట్లను ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. సంగారెడ్డి చౌరస్తా సమీపంలోని ఎస్ఎస్ గార్డెన్స్‌లో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(టీపీయూఎస్-తపస్) జిల్లా శాఖ ఆధ్వర్యంలో వ్యాసపూర్ణిమను పురస్కరించుకుని గురువందన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ చిన్నతనంలో వారికి చదువులు నేర్పిన గురువులను స్మరించుకుని గురువుల గొప్పదనం గురించి కొనియాడారు. అఖిల భారత సాహిత్య పరిషత్ ప్రాంత ప్రచార కార్యదర్శి భాస్కర యోగి మాట్లాడుతూ గురువుల ఔన్నత్యాన్ని చాటేలా ఉపాధ్యాయులు పనిచేయాలని సూచించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మామిడి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ కేజీబీవీ ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ వర్తింపజేయాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లాస్థాయిలో విశిష్ట సేవలందించి 78 మంది ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్‌సురేశ్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దత్తాత్రి, అడివప్ప, రాష్ట్ర సహ కోశాధికారి భాస్కర్‌దేశ్, కార్యదర్శి దుబాషి భాస్కర్, వివిధ మండలాల బాధ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

పెండింగ్ డీఏలు విడుదల చేయాలి

తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ యూనియన్(టీపీటీయూ) జిల్లా కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం పోతిరెడ్డిపల్లి జడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించారు. టీపీటీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు వేణుగోపాలస్వామి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలు విడుదల చేయాలని, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, టీచర్లు లేనిచోట వాలంటీర్లను నియమించాలని కోరారు. అనంతరం ఇటీవల పదోన్నతి పొందిన, పదవీ విరమణ చేసిన టీపీటీయూ సభ్యులను సన్మానించారు. జిల్లా అధ్యక్షుడు నక్క రమేశ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి భుజంగం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు

'ఆశా'ల సమస్యలను పరిష్కరించాలి

● సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 1: ఆశావర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు ఇచ్చి వారి సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆశాల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి విడనాడాలని, అధికారుల వేధింపులు ఆపాలని ఆయన డిమాండ్ చేశారు. ఆశాలు 12 ఏళ్లుగా పనిచేస్తున్నా.. నేటివరకూ వారికి కనీస వేతనం లేదన్నారు. రోజురోజుకు పనిభారం పెంచుతున్నారే తప్ప వేతనం పెంచడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక.. వేతనాలు పెంచడమే కాదు ఇతర సమస్యలను కూడా పరిష్కరిస్తామని ఓట్లు వేయించుకుని, అధికారంలోకి వచ్చాక ఆశాలను విస్మరిస్తుందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఆశావర్కర్లకు కనీస వేతనాలు రూ.26 వేలు ఇచ్చి ఈఎస్ఐ, పీఎఫ్, ఉద్యోగ భద్రత కల్పించాలని సాయిలు డిమాండ్ చేశారు. లేని పక్షంలో మరో పోరాటం తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు వరలక్ష్మీ, నాయకులుల ప్రశాంతి, వీరమణి, లావణ్య, పద్మ, విజయలక్ష్మి, సునీత, సావిత్రి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చదువు ప్రాముఖ్యత తెలిపేందుకు 'రీడ్ ఏ థాన్'

● 3న అన్ని పాఠశాలల్లో అరగంట పాటు ఒకేసారి పుస్తక పఠనం

కొండపాక, సెప్టెంబరు 1: మిషన్ నిపున్ భారత్‌లో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలను పెంపొందించడమే లక్ష్యంగా ఎఫ్ఎల్ఎన్, ఎల్ఐపీ లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. చదవడం, రాయడం, గణిత భావనల్లో చతుర్విధ ప్రక్రియలు చేయడం వంటి కనీస సామర్థ్యాలు పెంపొందిస్తే భావితరం మరింత నైపుణ్యవంతమైన దేశంగా తయారవుతుందని భావన. పిల్లల్లో చదివే నైపుణ్యం, అలవాటును పెంచేందుకు రూమ్ టూ రీడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతీ విద్యాసంవత్సరం ఆగస్టు 15 నుంచి సెప్టెంబరు 8 వరకు పాఠశాల విద్యాశాఖతో కలిసి రాష్ట్రస్థాయి రీడింగ్ క్యాంపెయిన్ నిర్వహిస్తున్నారు. ఈ విద్యా సంవత్సరం మేక్ రూమ్ ఫర్ ఎర్లీ మార్నింగ్ థీమ్‌తో 3 నుంచి 8 వయసు ఉన్న చిన్నారుల్లో చదివే అలవాటు, చదివే నైపుణ్యం మరింత బలోపేతం చేయడానికి సెప్టెంబరు 3న ఉదయం 11 నుంచి 11.30 గంటల మధ్య ప్రతీ పాఠశాలలో డ్రాప్ ఎవ్రీథింగ్ అండ్ రీడ్, రీడ్ ఏ థాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. 3న అరగంట సేపు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రతిఒక్కరికీ పుస్తక పఠనం చేసేవిధంగా విద్యాశాఖ చర్యలు తీసుకుంటుంది. చిన్నారుల్లో చదివే నైపుణ్యాన్ని పెంపొందించడానికి నిర్విరామ కృషి చేస్తున్న రూమ్ టూ రీడ్ రాష్ట్ర ప్రతినిధి నరసింహచారి, జిల్లా ప్రతినిధులు రవి, మధు, సునీతలను జిల్లా విద్యాధికారి శ్రీనివాసరెడ్డి అభినందించారు.



సామూహిక పుస్తకం చదువుతున్న విద్యార్థులు

పుస్తక పఠనాన్ని విజయవంతం చేయాలి: డీఈవో

మిషన్ నిపున్ భారత్‌లో భాగంగా ప్రాథమిక స్థాయిలోనే చదవడం, రాయడం గణితంలో చతుర్విధ ప్రక్రియలు చేయడం లాంటి కార్యక్రమాలు పాఠశాలల్లో అమలవుతున్నాయి. 3 నుంచి 5 సంవత్సర పిల్లలు కనీస అభ్యసన సామర్థ్యాలు సాధించే దిశగా ముందుకు వెళ్తున్నాం. అది ఈ ఏజ్ గ్రూప్‌లోనే ఒక అలవాటుగా మార్చితే సుసాధ్యం చేసుకోగలం. ఈ దిశగా రూమ్ టూ రీడ్ ఆధ్వర్యంలో 3న నిర్వహించబోయే రీడ్ ఏ థాన్ అనే కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం. ఆ రోజు ఉదయం 11 నుంచి 11.30 వరకు ఎక్కడి వారం అక్కడనే పుస్తక పఠనం చేసి చదవడం ప్రాముఖ్యతను లోకానికి చెప్పుదాం.

కొమురవెల్లిలో పందులు, కుక్కల బెడద

● ఆందోళనలో గ్రామస్థులు, భక్తులు



మల్లన్న ఆలయ రాతిగీరెల ప్రాకార ఆవరణలో పందులు

చేర్యాల, సెప్టెంబరు 1: కొమురవెల్లి మండల కేంద్రంలో పందులు, కుక్కలు స్వైరవిహారం చేస్తుంటంతో ప్రజలు, భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొద్దిరోజులుగా పందులు మల్లన్న ఆలయ పరిసరాలు, రాతిగీరెలు, బుకింగ్ కార్యాలయ ఆవరణలో సంచరిస్తూ వ్యర్థాలను వెలికితీస్తూ అపరిశుభ్ర వాతావరణాన్ని తలెత్తిస్తుండటంతో సమీపవాసులు తంటాలుపడుతున్నారు. అంతేకాకుండా వీధులు, దారి వెంట కుక్కలు సంచరిస్తూ నడుచుకుంటూ పోయేవారితో పాటు వాహన చోదకులను వెంబడిస్తున్నాయి. అధికారులు స్పందించి పందుల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని, కుక్కల బారి నుంచి కాపాడాలని ప్రజలు వేడుకుంటున్నారు.

పోయింది కొండంత.. దొరికింది గోరంత..

● సిద్దిపేట జిల్లాలో పెరుగుతున్న సైబర్ నేరాలు

● ప్రత్యేకంగా సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్

● అయినా ఫలితం శూన్యం

● ప్రతీరోజు రెండు, మూడు కేసులు నమోదు

● దొరకని సైబర్ నిందితులు

● పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరుగుతున్న బాధితులు



సిద్దిపేట క్రైం, సెప్టెంబరు 1: సిద్దిపేట జిల్లాలో రోజురోజుకు సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయి. చదువుకోని వృద్ధులతోపాటు, చదువుకున్న యువకులు, మేధావులు, అధికారులు సైబర్ నేరగాళ్ల వలలో పడి మోసపోతున్నారు. లోన్ యాప్, లాటరీ, పార్ట్‌టైం జాబ్, విదేశీ ప్రయాణం, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం, పాన్‌కార్డ్ అప్‌డేట్స్, ఆధార్‌కార్డు లింకు పేర్లతో మెసేజ్‌లు రాగానే ప్రజలు ఆశపడి మోసపోతున్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గ్రామాల్లో, పట్టణాల్లో, విద్యాసంస్థల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నప్పటికీ సైబర్ నేరాలు తగ్గడం లేదు. సైబర్ నేరాల ను అరికట్టడంలో పోలీసులు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. పేరుకే అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, సైబర్ నేరాలను అరికట్టడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఉన్న ప్రతి పోలీస్‌స్టేషన్లో ప్రతిరోజు రెండు, మూడు సైబర్ క్రైమ్ కేసులు నమోదవుతున్నాయి అంటే జిల్లా పోలీసు అధికారులు సైబర్ నేరాలను నివారించడంలో విఫలమైనట్లు తెలుస్తున్నది.

ప్రత్యేకంగా సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్

జిల్లాలో సైబర్ నేరాలను అరికట్టడానికి ప్రత్యేకంగా సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. సైబర్ నేరాలకు గురైన బాధితులు వెంటనే 1930కు కాల్‌చేసి వివరాలు నమోదు చేసి సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ సెకండ్ ఫ్లోర్‌లో ఉన్న సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి దరఖాస్తు ఇవ్వాల్సి ఉంటుంది. సైబర్ క్రైమ్ జరిగిన గంటలోపు 1930కు కాల్ చేసి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే అమౌంట్ సీజ్ చేస్తామని పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. కానీ కొంతమంది బాధితులు సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా.. పోగొట్టుకున్న అమౌంటును సీజ్‌చేసి బాధితులకు అప్పగించడం లేదు. సైబర్ క్రైమ్‌లను నివారించడానికి జిల్లాలో ప్రత్యేకంగా సైబర్‌క్రైమ్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటుచేశారు. అందులో ఒక ఏసీపీ, సీఐ, ఎస్ఐలను విధులు నిర్వహిస్తున్నా.. ఫలితాలు మాత్రం శూన్యమనే చెప్పవచ్చు. రెండురోజుల క్రితం బెజ్జంకి పోలీస్‌స్టేషన్లో ఆన్‌లైన్ ట్రేడింగ్ ఇన్వెస్ట్‌మెంట్లలో డబ్బులు పెడితే ఎక్కువ మొత్తంలో వస్తాయని నమ్మించి మోసం చేసిన కేసులో రంగారెడ్డి జిల్లాకు చెందిన ముగ్గురు సైబర్ నేరస్తులను హైదరాబాద్‌లో సిద్దిపేట సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. ఈ సంవత్సరంలో సైబర్ క్రైమ్ కేసుల్లో బాధితులు పోగొట్టుకున్న డబ్బుల్లో పోలీసులు కేవలం 20 శాతం ఫ్రీజ్ చేశారు

ప్రతిరోజు రెండు, మూడు కేసులు

జిల్లాలో ప్రతిరోజు ఎక్కడో ఒకచోట సైబర్ క్రైమ్ జరుగుతున్నది. ప్రజల బలహీనతలైన ఆశ, భయం రెండిటిని సైబర్ నేరగాళ్లు చూపెట్టి డబ్బులు దోచుకుంటున్నారు. బాధితులు ప్రతిరోజు స్థానిక పోలీస్‌స్టేషన్లకు, కమిషనర్ కార్యాలయంలో ఉన్న సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్‌కు బారులు తీరుతున్నారు. సరైన న్యాయం దొరకక వెనుదిరుగుతున్నారు. అధునాతన టెక్నాలజీ ఉన్నప్పటికీ సైబర్ నేరస్తులను మాత్రం పట్టుకోవడంలో పోలీసులు విఫలమవుతున్నట్లు పలువురు బాధితులు విమర్శిస్తున్నారు.

దొరికింది.. గోరంతే..

జిల్లాలో ఈ సంవత్సరం ఇప్పటివరకు 165 సైబర్‌క్రైమ్ కేసులు నమోదయ్యాయి. రూ.3,84,75,893 బాధితులు పోగొట్టుకోగా... పోలీసులు కేవలం రూ.87,13,872 ఫ్రీజ్ చేశారు. ఈ సంవత్సరం సైబర్‌క్రైమ్ పోలీసులు కేవలం ఎనిమిదిమంది నిందితులను మాత్రమే అరెస్టు చేశారు. అధికారికంగా సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదుచేసిన వారు 165 మంది అయితే.. అనధికారికంగా ఫిర్యాదు చేయని వాళ్లు చాలామంది ఉన్నారు. బయటకు చెబితే పరువుపోతుందని ఫిర్యాదు చేయకుండా వెనకడుగు వేస్తున్నారు. ప్రతిరోజు రాంగ్ కాల్స్‌తో, రాంగ్ మెసేజ్‌లతో సైబర్ క్రైమ్‌కు గురవుతున్నారు. ఇకనైనా పోలీసులు సైబర్‌క్రైమ్ కేసులపై ప్రత్యేక చర్యలు తీసుకొని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.


జిన్నారం: వావిలాల పీర్లా చెరువును పరిశీలిస్తున్న సీఐ సుధీర్‌కుమార్, ఎస్ఐ నాగలక్ష్మి, మాజీ ఎంపీపీ రవీందర్‌గౌడ్


జహీరాబాద్ మున్సిపాలిటీలో పలు కాలువలను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి


తూప్రాన్ వద్ద కిష్టాపూర్ రోడ్డుకు అడ్డుగా పెట్టిన స్టాపర్లను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

నిబద్ధతకు నిదర్శనం

ఓ వైపు ఎడతెరపి లేని వర్షం. మరోవైపు విద్యుత్‌కు అంతరాయం కల్గడంతో స్థానికుల ఇబ్బందులు అంతా ఇంతా కాదు. దీంతో విద్యుత్ సిబ్బంది ఎడతెగని భారీవర్షాన్ని సైతం సైతం లెక్కచేయకుండా వర్షంలోనే ఆదివారం నర్సాపూర్‌లో ట్రాన్స్‌ఫార్మర్‌ను మరమ్మతు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. అంత వర్షంలోనూ విద్యుత్ సిబ్బంది నిబద్ధతతో పని చేయడాన్ని ప్రశంసిస్తూ స్థానికులు సోషల్‌మీడియాలో పెద్ద ఎత్తున వైరల్ చేయడం గమనార్హం.

- నర్సాపూర్, సెప్టెంబరు 1



ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


తూప్రాన్ వద్ద హల్దీవాగు ఉధృతిని పరిశీలిస్తున్న ఆర్డీవో జయచంద్రారెడ్డి

రెండు రోజులుగా ఎడతెగని వర్షాల నేపథ్యంలో సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ప్రజాజీవనం అస్తవ్యస్తమైంది. అంతర్గత రోడ్లు, రహదారులు జలమయమై లోతట్టు ప్రాంతాల్లోని నివాసాల్లోకి నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. చెరువులు, కుంటల్లోకి వరదనీరు చేరి పలుచోట్ల బ్రిడ్జిలపై నుంచి పొంగిపొర్లాయి. రాకపోకలు దాదాపుగా స్తంభించాయి. దీంతో అధికారులు చెరువులు, కుంటలను సందర్శించి ప్రజలు జాగ్రత్తగా ఉండాలంటూ అప్రమత్తం చేశారు. అత్యవసర పరిస్థితుల దృష్ట్యా కంట్రోల్ రూంలను ఏర్పాటు చేశారు.

జహీరాబాద్, సెప్టెంబరు 1: భారీ వర్షాల నేపథ్యంలో జహీరాబాద్ పట్టణంలోని లోతట్టు ప్రాంతాలను మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ సిబ్బందితో కలిసి ఆదివారం పరిశీలించారు. పట్టణంలోని అంతర్గత రోడ్లపై నీరు నిల్వకుండా సిబ్బందిని అప్రమత్తం చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇబ్బందులుంటే మున్సిపల్ సిబ్బందికి సమాచారమివ్వాలన్నారు.

● కంగ్టి: మండలంలో దామర్‌గిద్ద కాకివాగు ప్రాజెక్టు, తడ్కల్ పెద్ద చెరువులను ఆదివారం నీటి పారుదలశాఖ ఏఈ రవీందర్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. వచ్చే రెండు రోజులపాటు భారీవర్ష సూచన ఉండడంతో చెరువుల పరిస్థితిని వారు పరిశీలించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. భారీవర్షాల నేపథ్యంలోప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితి ఉంటే 8712656760కు కాల్ చేయాలని సూచించారు.

● నాగల్‌గిద్ద: నాగల్‌గిద్ద,సెప్టెంబరు 1: భారీ వర్షాలకు మండలపరిధిలోని నాగల్‌గిద్ద తోపాటు ఏస్గీ, ఔదత్‌పూర్ల గ్రామాల శివారులో గల చెరువులను ఆదివారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హన్మంత్‌రెడ్డి, ఇరిగేషన్ ఏఈ ప్రకాష్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగావారు మాట్లాడుతూ ప్రజలుఅప్రమత్తంగా ఉండాలన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో నాగల్‌గిద్ద ఎస్ఐ బి.సాయిలు మాట్లాడుతూ ప్రజలు అత్యవసరమైతేనే బయటకు వెళ్లాలని సూచించారు.


పెద్దశంకరంపేట: టెంకటి మత్తడిని పరిశీలిస్తున్న తహసీల్దార్ గ్రేస్‌బాయ్

● జిన్నారం, సెప్టెంబరు 1: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు అన్నారు. ఆదివారం వావిలాల పీర్లా చెరువును జిన్నారం సీఐ సుధీర్‌కుమార్, ఎస్ఐ నాగలక్ష్మి, మాజీ ఎంపీపీ రవీందర్‌గౌడ్ పరిశీలించారు. వరద నీటితో చెరువులు నిండటంతో స్థానిక పరిస్థితులను పరిశీలించారు. కాగా వావిలాల, ఊట్ల గ్రామాల చెరువులను తహసీల్ధార్ భిక్షపతి, ఆర్ఐ జయప్రకాశ్, ఇరిగేషన్ ఏఈ దిలీప్‌లు పరిశీలించారు.

● తూప్రాన్: యావాపూర్ శివారులో హల్దీవాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో తహసీల్దారు విజయలక్ష్మి, ఎస్ఐ శివానందం, మున్సిపల్ కమిషనర్ ఖాజామోయిజోద్దీన్ సిబ్బంది పర్యవేక్షించారు. పెద్దచెరువు కట్టుకాలువకు అడ్డుగా ఉన్న పిచ్చి మొక్కలు, చెత్తను ఎక్స్‌వేటర్‌తో తొలగించారు. పట్టణంలో కౌన్సిలర్లు వార్డులో పర్యటించి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూశారు. తూప్రాన్ మండలంలో ఐదు ఇళ్లు కూలిపోయినట్లు రిపోర్టు చేశారని, నర్సంపల్లిలో రెండు, ఘనపూర్, ఇస్లాంపూర్, ఆబోతుపల్లిలలో ఒక్కొక్క ఇల్లు కూలిపోయినట్లు ఆర్ఐ నాగరాజు తెలిపారు. కాగా తూప్రాన్ రెవెన్యూ డివిజన్ పరిధిలో పరిస్థితులను తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి పరిశీలించారు. కార్యాలయంలో ఉండి అధికారులతో పరిస్థితులపై ఎప్పటికప్పుడు తెలుసుకున్నారు. తూప్రాన్ డివిజన్ పరిధిలో 24 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నట్లు తెలిపారు. ఆర్డీవో కార్యాలయంలో 24 గంటలు కంట్రోల్ రూం పనిచేస్తుందని తెలిపారు.


హవేళిఘణపూర్: రాజిపేట వాగును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

● పెద్దశంకరంపేట: పెద్దశంకరంపేటలో పలువురి గృహాల్లోకి వర్షపు నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఆదివారంపేట తహసీల్దార్ గ్రేస్‌బాయ్, ఆర్ఐ శర్దప్ప, ఏఎస్ఐ సునీత తదితరులు బుజ్రాన్‌పల్లి చెరువు, టెంకటి మత్తడిలను పరిశీలించారు. భారీ వర్షాలు కురుస్తున్నందున శిథిలావస్థకు చేరుకున్న గృహాలలో ఎవరూ నివసించకూడదని తహసీల్దార్ గ్రేస్‌బాయ్, పేట ఎస్ఐ శంకర్ పేర్కొన్నారు.


చిన్నశంకరంపేట: సూరారం పెద్దచెరువు అలుగు పొంగిపొర్లడంతో సూరారం-ధర్పల్లి రోడ్డుపై మొద్దులను అడ్డుగా వేస్తున్న పోలీసులు

●హవేళిఘణపూర్: మండలంలోని ప్రమాద ప్రాంతాలైన దూప్‌సింగ్ తండా వాగు, పోచారం డ్యామ్ అలుగు ప్రాంతాలను మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ నవీన్‌కుమార్, ఎస్ఐ సత్యనారాయణ సందర్శించి ప్రజలను ప్రమత్తం చేశారు. పురాతన ఇండ్లల్లో ప్రజలు నివసించరాదని సూచించారు.

అత్యవసరమైతేనే బయటకు వెళ్లండి

నారాయణఖేడ్, సెప్టెంబరు 1: భారీ వర్షాలు కురుస్తుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఆదివారం వేర్వేరు ప్రకటనలో ప్రజలను కోరారు. ప్రస్తుతం ఎడతెరిపి లేకుండా భారీవర్షాలు కురుస్తున్నందున అత్యవసరం అయితే తప్ప ఇంటి నుంచి బయటకు రావద్దని సూచించారు. విద్యుత్ స్తంభాలను, తీగలను ఎవ్వరూ తాకరాదన్నారు. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, చెరువులవద్దకు ఎవ్వరూ వెళ్లవద్దని సూచించారు. ఏదైన సమస్యవస్తే వెంటనే సమీప పోలీస్‌స్టేషన్‌లకు గానీ, తహసీల్ కార్యాలయాలకు గాని సమాచారం అందించాలన్నారు.

- ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి

వర్షాలతో జర జాగ్రత్త

నర్సాపూర్,సెప్టెంబరు 1: రెండు రోజులుగా ఎడతెరపి లేని వర్షం కురుస్తున్నందున నర్సాపూర్ నియోజకవర్గంలోని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి కోరారు. ఆదివారం ఎమ్మెల్యే సునీతారెడ్డి స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఎడతెరపి లేకుండా వర్షం వస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితులుంటే తప్ప బయటకు వెల్లరాదని సూచించారు. ఆయా ప్రాంతాల్లో తడిగా ఉన్న స్తంభాలకు దూరంగా ఉండాలని, పంట పొలాల్లో రైతులు విద్యుత్ పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. గాలి, దుమారం,వర్షం వల్ల తెగిపడ్డ వైర్లను ముట్టుకోవద్దని సునీతారెడ్డి తెలిపారు.

- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి


చిన్నశంకరంపేట: సూరారంలో కూలిన ఇల్లు


కొల్చారం: వాగు పొంగిపొర్లడంతో మెదక్- కొంగోడ్ మధ్య రాకపోకలకు అంతరాయం


సంగారెడ్డిలో మహబూబ్‌సాగర్ చెరువు నీటిలో ఇళ్లు


జోగిపేట: విరిగిన చెట్టును తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది


వెల్దుర్తి: అలుగు పోస్తున్న దామరంచ చెక్‌డ్యామ్

నారాయణఖేడ్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు: ఆర్డీవో

నారాయణఖేడ్, సెప్టెంబరు 1: వర్షాల వల్ల ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి ఆదివారం ఉదయం నుంచి అత్యవసర సహాయం కోసం కంట్రోల్ రూంను స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసినట్లు ఆర్డీవో అశోక చక్రవర్తి తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివరాలు తెలుసుకున్నారు. ఎవరికైన ఏవైనా సమస్యలు ఉంటే కంట్రోల్ రూం నెంబరు 8074252178కు సమాచారం ఇవ్వాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ తహసీల్దార్‌రాజుపటేల్, ఆర్ఐ మాధవరెడ్డి పాల్గొన్నారు. ఖేడ్ మున్సిపల్ పరిధిలోను ప్రజలు వర్షాల వల్ల అప్రమత్తంగాఉండాలని ఎక్కడైనా విద్యుత్ తీగలు, కొమ్మలు, చెట్లు, తెగిపడితే వెంటనే 9440036431, 9133449496, 9949309592 ఫోన్ నంబర్లకు సమాచారం అందించాలని కమిషనర్ జగ్జీవన్ కోరారు.

సీపీఎం 15వ మహాసభల సన్నాహక సమావేశం

తూప్రాన్, సెప్టెంబరు 1: తూప్రాన్ పట్టణంలో నవంబరు 2, 3 తేదీల్లో సీపీఎం జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి మల్లేశం తెలిపారు. తూప్రాన్‌లో ఆదివారం 15వ మహాసభల సన్నాహక సమావేశం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు నర్సమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కార్యదర్శి మల్లేశం మాట్లాడుతూ.. ఆహ్వాన సంఘం ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించినట్లు పేర్కొన్నారు. జిల్లా మహాసభను విజయవంతం చేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మహేందర్‌రెడ్డి, కె.మల్లేశం, కడారి నాగరాజు, సంతోష్, రమేష్, బాలమణి, ఆజయ్, రామవ్వ, యాదగిరి, సిద్దవ్వ, బిక్షపతి, నర్సింహులు పాల్గొన్నారు.

నేడు వీరభద్రస్వామి ఆలయంలో సోమవతి అమావాస్య పూజలు


ఆలయంలోని శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 1: సంగారెడ్డి పట్టణంలోని కొత్తబస్టాండ్ ఎదురుగా ఉన్న భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో ఈ నెల 2వ తేదీన సోమవతి అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి శివకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.30 గంటల నుంచి 10.30 గంటల వరకు సామూహిక అభిషేక కార్యక్రమాలు, మధ్యాహ్నం 12 గంటలకు అఖండ హారతి వుంటాయన్నారు. సాయంత్రం 7 గంటలకు భక్తులచే బిల్వార్చన పార్వతీ పరమేశ్వరుల పల్లకీ సేవ ఉంటాయని చెప్పారు. అనంతరం మహా మంగళ హారతి, అన్న ప్రసాద వితరణ వుంటుందని ఆయన చెప్పారు.

బడంపేటకు పాదయాత్రగా వెళ్లిన లింగాయత్ సమాజ్‌నాయకులు

జహీరాబాద్, సెప్టెంబరు 1: లోక కల్యాణార్థం లింగాయత్ సమాజ్ ఆధ్వర్యంలో ఆదివారం జహీరాబాద్ నుంచి సమాజ్ నాయకులు, భక్తులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో కోహీర్ మండలంలోని బడంపేటకు రాచన్నస్వామిని దర్శించుకోవడానికి పాదయాత్రగా వెళ్లారు. వర్షాన్ని లెక్క చేయకుండా భక్తులు బడంపేటకు వెళ్లి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

స్మార్ట్‌సిటీ ఏర్పాటుతో జహీరాబాద్ అభివృద్ధి

● మాజీ ఎంపీ బీబీపాటిల్


మాట్లాడుతున్న మాజీఎంపీ బీబీపాటిల్ తదితరులు

జహీరాబాద్, సెప్టెంబరు 1: ప్రధాని మోదీ కృషివల్లే జహీరాబాద్‌కు స్మార్ట్ సిటీ వచ్చిందని మాజీ ఎంపీ, బీజేపీ రాష్ట్ర నాయకుడు బీబీపాటిల్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని సిద్ది-ఇన్‌లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జహీరాబాద్ ప్రాంతంలో నిమ్జ్ ఏర్పాటు కావడం, అందులో స్మార్ట్ సిటీ తదితర పరిశ్రమలు ఏర్పాటు కావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. జహీరాబాద్ రైల్వేస్టేషన్ అభివృద్ది కూడా జరుగుతుందని గుర్తు చేశారు. ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో బాగంగ దేశవ్యాప్తంగ రూ.28,602 కోట్ల వ్యయంతో 12 పారిశ్రామిక స్మార్ట్ సిటీలను ఏర్పాటుచేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. నేషనల్ ఇండస్ట్రీయల్ కారిడార్ డెలవలప్‌మెంట్, ఇంప్లీమెంటేషన్‌ట్రస్టు (ఎన్ఐసీడీఐటీ) ఆధ్వర్యంలో 3,245 ఎకరాల్లో మొదటిదశలో పనులు ప్రారంభంకానున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి మంజూరు చేసిన మెగా ప్రాజెక్టును జహీరాబాద్‌కు కేటాయించడంతో స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు. హైదరాబాద్- నాగపూర్ ఇండస్ట్రీయల్ కారిడార్‌లో భాగంగ జహీరాబాద్ నియోజకవర్గంలోని ఝరాసంగం, న్యాల్‌కల్ మండలాల్లోని 17గ్రామాల్లో ఇండస్ట్రియల్ స్మార్ట్‌సిటీ నిర్మాణం జరుగనుందన్నారు. ఇండస్ట్రీయల్ స్మార్ట్‌సిటీ ద్వారా 1.74 లక్షలమందికి ఉపాధి లభించనున్నట్టుచెప్పారు. భూములు కోల్పోతున్న రైతుల అభ్యున్నతికి తమ వంతు బాధ్యతగా కృషిచేస్తామన్నారు. ముంబాయిలాంటి ప్రధాన పట్టణాలకు జహీరాబాద్ మీదుగా బుల్లెట్ రైలును కొనసాగించాలని కేంద్రప్రభుత్వం దృష్టికి తీసుకుపోతామన్నారు. జహీరాబాద్‌కు స్మార్ట్‌సిటీ మంజూరు చేసినందుకు కేంద్రమంత్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పారు. అనంతరం మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, నౌబాద్ జగన్, గొల్లభాస్కర్, పాండురంగారెడ్డి, శ్రీనివాస్‌గుప్త, విశ్వనాథ్, దుర్గయ్య, ఓంకార్‌యాదవ్, వైద్యనాథ్, సుభాష్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, నరేష్‌పాటిల్, అరుణా కౌశాస్, మంజులా కౌశాస్, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేతకీలో ప్రత్యేక పూజలు

ఝరాసంగం, సెప్టెంబరు 1: మండలకేంద్రంలోని కేతకీ ఆలయంలో మాజీ ఎంపీ బీబీపాటిల్ ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఆయనకు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. ఆయన వెంట బీజేపీ నాయకులు విజేందర్‌రెడ్డి, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిమార్గంలో పయనిస్తే సమాజంలో చెడు కనిపించదు


నిజాంపేట మండలం బల్కంచెల్కా తండాలోని భవానీమాత ఆలయంలో దీక్షధారణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సంగ్రామ్ మహారాజ్

కల్హేర్, సెప్టెంబరు 1: ప్రతి మానవుడు భక్తి మార్గం వైపు పయనిస్తే సమాజంలో చెడు అనేది కనపడదని అఖిల భారత సాధు, సంతుల తెలంగాణా రాష్ట్ర ప్రతినిధి, కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రామ్ మహారాజ్ పేర్కొన్నారు. నిజాంపేట మండల పరిధిలోని బల్కంచెల్కా తండా విశ్వపాలిని జ్వాలాముఖి భవానీ మాతా ఆలయంలో ఆదివారం 40 మంది భక్తులకు మాలలు వేసి భవానీ మాతా మండల దీక్షలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తులనుద్ధేశించి అనుగ్రహ భాషణం చేశారు. సమాజంలో భక్తి భావం ఏర్పడితే చెడు అనేది దరి చేరదన్నారు. నేడు భక్తి భావం పెరుగుతున్నా అదేస్థాయిలో అరాచకాలు కూడా పెరుగుతున్నాయన్నారు. ప్రజలందరూ భక్తి భావం వైపు అడుగులు వేస్తే అలాంటి చెడు గుణాలను అరికట్టవచ్చునని సంగ్రామ్ మహారాజ్ ఉద్భోదించారు.. బల్కంచెల్కా తాండాలో ఆలయ దర్మకర్త, రవాణా శాఖ ఉన్నత ఉద్యోగి అయిన మూడ్ కిషన్‌సింగ్ స్పూర్తితో యువకులు, ఉద్యోగులు సంవత్సరాల తరబడి భవానీ మాత దీక్షలు చేపట్టడం సంతోషకర విషయమని సంగ్రామ్ మహారాజ్ అన్నారు. కార్యక్రమంలో స్థానిక మాజీ సర్పంచ్ మూడ్ లలితా కిషన్ సింగ్, రాములు, శంకర్, సవాయిసింగ్, మన్మోహన్‌సింగ్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

● నారాయణఖేడ్, సెప్టెంబరు 1: దీక్షలతోనే మోక్షంలభిస్తుందని అఖిల భారతసాధుసంతుల రాష్ట్ర ప్రతినిధి, కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రామమహారాజ్‌అన్నారు. ఆదివారం నారాయణఖేడ్‌లో భవానీ దీక్షలను స్వీకరించిన వారికి మాలాధరణ చేసి భక్తులనుద్ధేశించి అనుగ్రహ భాషణంచేశారు. కార్యక్రమంలో సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్ మాట్లాడుతూ దీక్షాదారుల కోసం ఎంపీడీవో కార్యాలయం సమీపంలోని రాంరావు ట్రస్టు భూమిలో ప్రత్యేకంగాషెడ్డును ఏర్పాటు చేయించామన్నారు. కార్యక్రమంలోరాజునాయక్, మోహన్‌నాయక్, లక్మణ్‌నాయక్, సుభాష్, జాదవ్, ప్రేమ్‌సింగ్, రాములు, పూజారి పాండు, తదితరులు ఉన్నారు.

ఘనంగా లక్ష్మీనృసింహుల కల్యాణం

శివ్వంపేట, సెప్టెంబర్ 1: మండలంలోని సికింద్లాపూర్ లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో శ్రావణమాసం చివరి ఆదివారం సందర్భంగా పూజారి ధనుంజయశర్మ ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం, పల్లకి సేవలను ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ నుంచి పెద్దసంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది నర్సింహారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.


స్వామివారికి పల్లకి సేవ నిర్వహిస్తున్న భక్తులు


ఉమా సంగమేశ్వర స్వామి ఆలయంలో భక్తుల పూజలు

ఉమా సంగమేశ్వరస్వామి ఆలయంలో పూజలు

పెద్దశంకరంపేట, సెప్టెంబరు 1: పెద్దశంకరంపేట మండలపరిధిలోని కొప్పోల్ ఉమాసంగమేశ్వరస్వామి ఆలయంలో గర్భగుడిలో కాశీబుగ్గ నీరు రావడంతో ఆదివారం భక్తులు అధికసంఖ్యలో స్వామివారిని దర్శించుకొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. కాశీ నుంచి నేరుగా కొప్పోల్ ఉమా సంగమేశ్వర స్వామి గర్భాలయంలోకి ప్రత్యేకంగా నీరు రావడాన్ని కాశీబుగ్గ అని ఇక్కడి ప్రాంత భక్తుల విశ్వాసం. ఆదివారం ఉదయం కొప్పోల్ ఉమాసంగమేశ్వరస్వామి గర్భాలయంలో కాశీబుగ్గరావడంతో భక్తులకు తీర్థంగా ఇచ్చినట్లు ఆలయ పూజారి సంగప్ప తెలిపారు. దాదాపు పదేళ్ల క్రితం కాశీబుగ్గ వచ్చిందని, ఈ సంవత్సరం శ్రావణమాసంలో కాశీబుగ్గ వచ్చిందని పూజారులు పేర్కొన్నారు. అధిక సంఖ్యలో భక్తులుస్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేయడంతోపాటు కీర్తనలు, భజనలు చేస్తున్నారు. ఆలయంలో భక్తులందరికీ కల్హేర్‌మండలానికి చెందిన గుర్రపు మశ్చందర్ ఫౌండేషన్‌చైర్మన్ మశ్చందర్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేపట్టారు.

రంగంపేటకు తరలి వెళ్లిన భక్తులు

నారాయణఖేడ్, సెప్టెంబరు 1: రంగంపేటలో మాధవానందసరస్వతి స్వామి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన లలితా సహస్రనామ పారాయణం, సౌందర్యలహరి పారాయణం కార్యక్రమాల్లో పాల్గొనేందుకు నారాయణఖేడ్ లలితా వైభవం ట్రస్టు నిర్వాహకులు మలమంచి మోహన్‌జోషి ఆధ్వర్యంలో ఖేడ్‌పట్టణానికి చెందిన మహిళలు బస్సుల్లో తరలివెళ్లారు. రంగంపేటలో నిర్వహించే కార్యక్రమాలకు మహిళా మాతృమూర్తులు వెళ్లిపాల్గొనడం ఆనవాయితీగా వస్తుంది.

కోనాయపల్లిలో హనుమాన్ ఆలయ వార్షికోత్సవం


హోమంలో భక్తులు

మనోహరాబాద్, సెప్టెంబర్ 1: మనోహరాబాద్ మండలం కోనాయపల్లి పిటి గ్రామంలో హనుమాన్ ఆలయం మొదటి వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పండితులు రాములుశర్మ పంతులు ఆధ్వర్యంలో హనుమాన్ ఆలయంలో గణపతిపూజ, శివలింగం, హోమం, హనుమాన్ పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే భాషబోయిన చంద్రశేఖర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేపట్టారు. పూజా కార్యక్రమాల్లో గ్రామస్థులు, యువకులు పాల్గొన్నారు.

సదాశివపల్లిలో..


హోమంలో పాల్గొన్న భక్తులు

కౌడిపల్లి, సెప్టెంబరు 1: మండలంలోని సదాశివపల్లిలో హనుమాన్ ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని ఆదివారం గ్రామస్థులు, పురోహితుడు ఉమశంకర్ శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి పూజ, ఆంజనేయస్వామి అభిషేకం, పుణ్యాహవాచనము, శ్రీసూక్త, పురుషసూక్త, మన్యుసూక్త, బలి పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి, మెదక్ జిల్లా వైశ్య సంఘం నాయకులు రమేష్ గుప్త, మాజీ సర్పంచ్‌లు నర్సింగరావు, వీరయ్య, నాగరాజు, ప్రభుతో పాటు గ్రామ పెద్దలు ఉన్నారు.

చేగుంటలో శ్రీమహంకాళి అమ్మవారికి బోనాలు


చేగుంటలో బోనాలతో మహిళల ఊరేగింపు

చేగుంట ,సెప్టెంబర్ 1: చేగుంటలో శ్రీమహంకాళి అమ్మవారికి ఆదివారం బోనాల ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. అంగరంగ వైభోగంగా డప్పు చప్పుళ్లతో పోతరాజుల విన్యాసం, బోనాలు తొట్టెల ఊరేగింపు జాతర కొనసాగింది. ఉదయం నుంచి భక్తులు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా బారులు తీరి అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు నాలుగు రోజులుగా అమ్మవారికి వివిధ కార్యక్రమాలు చేపట్టారు. అలయ కమిటీ అధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో ఉపాధ్యాయులు,పూర్వ విద్యార్థులు

కొండాపూర్, సెప్టెంబర్ 1: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1999-2000 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం మారేపల్లిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమకు చదువు నేర్పించిన ఉపాధ్యాయులకు పూలమాలలు వేసి సన్మానించారు. పరస్పర క్షేమసమాచారాలను తెలుసుకుంటూ గత స్మృతులను నెమరవేసుకున్నారు నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. అనంతరం సహపంక్తి బోజనాలు చేశారు.

జిన్నారంలో..


జిన్నారంలో పూర్వ విద్యార్థుల సందడి

జిన్నారం, సెప్టెంబరు 1: జిన్నారం ప్రభుత్వ పాఠశాలలో 2003-04 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని వేడుకగా జరుపుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తమకు విద్యాబుద్దులు నేర్పిన ఉపాధ్యాయులపై పూల వర్షం కురిపించి స్వాగతం పలికారు. తమకు విద్యాబోధన చేసిన గురువులను ఘనంగా సన్మానించారు.

పేట శిశుమందిర్‌లో సామూహిక అగ్నిహోత్రం

పెద్దశంకరంపేట,సెప్టెంబరు 1: పెద్దశంకరంపేటలోని శ్రీసరస్వతీ శిశుమందిర్‌లో ఆదివారం ఉదయం విశ్వఫౌండేషన్ ఆధ్వర్యంలోసామూహిక అగ్నిహోత్రం హోమంనిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వఫౌండేషన్ బాధ్యులు మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించడానికి అగ్నిహోత్రం హోమాలు ఎంతగానో తోడ్పడతాయన్నారు. సూర్యోదయం, సూర్యాస్తమయాల్లో అగ్నిహోత్రంచేయడం వల్ల ఎన్నో లాభాలు ఉంటాయని వివరించారు. విశ్వ ఫౌండేషన్ ఆధ్వర్యంలో లోక కల్యాణార్థం అన్నిగ్రామాల్లో అగ్నిహోత్రం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు వివరించారు. కార్యక్రమంలోమాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, గ్రామ పెద్దలు ఆర్ఎస్ఎస్ బాధ్యులు జైహింద్‌రెడ్డి, సీతారామారావు, వీరప్ప, సతీష్‌గౌడ్, మల్లేశం,గాండ్లసంగమేశ్వర్, సర్వేశ్వర్, గ్రామస్థులు పాల్గొన్నారు.